# మనస్తత్వాలు

'నాకు ఈ మనుష్యులమీద నమ్మకం పోతోంది' అంది వసుధ. నాకు నవ్వొచ్చింది.

నీ మీద నీకు నమ్మకంవుందా? తన్ను తాను నమ్మ లేని వాళ్ళు ఇంకొకళ్ళని నమ్మలేరుట! అన్నాను వెటకా రంగా.

'నీ కేం! నీ జీవితం వడ్డించిన ఇస్తరి. నవ్వులాటగానే వుంటుంది' అంది వసుధ.

నాకు బాధ అనిపించింది. లోలోన ఎన్ని అగ్నిపర్వ తాలు ఘూర్జిల్లుతున్నా పైకి చిరునవ్వు నవ్వాలనేతత్వం నాది. కొంతమంది బాధలు అనుభవించటంలో కంటే, ఆ బాధల్ని చూసి సానుభూతి చెందేవారి సంఖ్యనుబట్టి సంతృప్తిపడే రకంగా వుంటారు. వసుధ ఈ రకంలోకే చెందుతుందని నా అనుమానం. లేకపోతే, అంత అపురూపంగా చూసుకునే భర్త, అల్లారుముద్దుగా పెంచి పెద్దచేసిన తల్లిదండ్రులూ వుండగా, ఆమెకేం లోటని అల్లా బెంగపెట్టుక కూర్చుంది.

'నిజంగా నువ్వే నన్ను వోదార్చగలదానివి లీలా! అంచేత నా మనస్సులో భుగభుగ మండే మంటల్ని నీకు మాటలుగా మార్చి చెబుతున్నాను. నా వేదనను అపార్థం చేసుకోకు అంది. వసుధ కళ్ళు చెమ్మగిల్లాయ్. ఆప్యా యంగా నా రెండు చేతులూ పట్టుకున్న వసుధ ముఖం కేసిచూచి

నిర్విణ్ణురాలనై పోయాను. ఏదన్నా వేళాకోళంగా అని ఆమెను మందస్మితిని, చేయగల ననుకున్న వూహను కార్యరూపం ధరింపచేయటం, నాకు వలనుపడ లేదు. నిజానికి వసుధ మును పటి కంటే బాగాచిక్కిపోయింది. నల్లపడిందికూడా. ఆమె ఎప్పుడూ వుదాసీనంగా వుంటోంది. మునుపట్లా తుళ్ళుతూ తూగుతూ వుండటంలేదు. అప్పుడప్పుడు జీవన్ అంటూ వుండే వాడు. 'చూడండి లీలా మీ వసుధకి ఏదో బెంగపట్టుకుంది. రోజురోజుకి చిక్కిపోతుంది. అక్కడికీ నేను దగ్గరుండే అన్నం కలిపిపెట్టుతున్నాను. వసుధ నవ్వేది. ఎండిన పెదాలమీదుంచి, శుష్కంగా వుండేది ఆహాసం'.

'కడుపులో లేనిది కౌగిలించుకుంటే వుంటుందా? మీరు ఎప్పుడయితే నిండు హృదయముతో అమెను అభిమానించ కలుగుతారో, అప్పుడే ఆమె పూర్ణారోగ్యవంతురా లవుతుంది' అనేశా. ఛ! ఎంతమాటనేశారూ! నన్నే శంకించు తున్నారన్న మాట! మొత్తానికి. మీ స్త్రీ బుద్ధి పోనిచ్చుకున్నారు కాదు. నా లాంటిభర్తలు ఈరోజుల్లో ఎవళ్లున్నారండీ! మీ ప్రియ సఖినే అడగండి! నేను నవ్వి వూరుకున్నేదాన్ని, జీవన్ వట్టి చిలిపివాడు. ఎప్పుడూ హుషారుగా, నవ్వుతూ నవ్విస్తూ వుంటాడు కావాలని ప్రేమించి పెళ్ళిచేసుకున్నారు. ఇద్దరూ పెళ్ళయి ఆరుసంవత్సరాలయింది. పిల్లలు కలుగలేదు. ఆ మాటే వసుధతో అన్నాను.

పిల్లలుంటే ఇల్లు గలగల్లాడుతూ వుంటుంది. వసూ! పిల్లలులేక నీకు మనశ్శాంతిగా లేదు. ఎవళ్ళనయినా పిల్లల్ని పెంచకూడదూ!

అదొక్కటే భగవంతుడు నాకిచ్చిన అమూల్యవరం! లేకపోతే తల్లిలేనిపిల్లలు ఈ లోకంలో వున్నత నైతికజీవుల్లా ఎల్లా పెరుగుతారు! నాపిల్లలు దొంగలుగా, జూదరులుగా, వ్యభిచారులుగా, అబద్ధాలకోరులుగా, పెరిగిపెద్దవుతే, నాఆత్మ క్షోభించదూ!

ఛ ఛ! ఎల్లాంటిమాటలు వినాల్సివస్తోంది! నీకు మతి పోతోంది వసూ! గట్టిగా మందలించాడు.

"నిజం చెప్తున్నాను లీలా! నీకోసంకాదు నేను చెబు తోంట! యీ ఆంధ్రదేశంలో నాలాంటి క్షుభితలు కోకొల్ల లుగా వున్నారు. వారందరికీ నాకథ వింటే ధైర్యంవస్తుంది" అని చెప్తున్నాను. మనమేకాదు. మనలాంటివారు చాలా మంది వున్నారు. అనుకుంటే, అదో ధైర్యంగా వుంటుంది. రోగిష్టివాళ్ళకి తనకున్న రోగము పదిమంది కుందని తెలిస్తే సంతృప్తి వుంటుంది. కాని ఈ సంతృప్తి అనేది బహు పరి మితంగా వుంటుంది. మనకున్న బాధలు ఇంకొకరికి వున్నా యంటే వున్న తృప్తి మనకున్న నగలూ, చీరెలూ ఇంకోరికి వున్నాయంటే వుండదు. పైపెచ్చు అసూయవస్తుంది. అసూయ దుఃఖానికి మూలహేతువు. మనం కష్టపడయినా నలుగురు తృప్తిగా వుండేట్లు చూడాలి. మన సుఖాలు చెప్పి

ఎదుటివారిని దుఃఖ పూరితుల్ని చేయటం పాపం కదూ! అని నవ్వింది. వింతగా కనిపించింది నాకు.

అయితే వసుధ ఇతరుల సుఖం కోసం, సంతృప్తి కోసం తాను బాధపడ్తున్నట్లు నటిస్తుందా? లేక నిజంగా అనుభవిస్తుందా? ఒకళ్ళు అసూయపడిపోతారేమో అని తాము బాధల్ని, కొని తెచ్చుకునేటంత అమాయకులుంటారా ఎక్కడన్నా? జిజ్ఞాసగా చూసాను వసుధ వేపు.

"నా నించి ఎవ్వరూ, బాధపడకూడదన్నది నా నిశ్చయం అని నీకు తెలుసుకదూ!' అంది.

"అవును" అన్నాను. వసుధ చిన్నప్పట్నించీ అంతే! తాను చేతులు నిండుగా కోసుకొచ్చేది పూవులన్నీ. ఏ పిల్లలైనా వాట్లవంక చూస్తే, చూచిందే తడువుగా ఇచ్చేసేది. అది పదేళ్ళపిల్లగా వుండగా వాళ్ళ నాన్నగారు దానికి మంచి సిల్కు ఫ్రాక్ కొనిచ్చారు. అది వేసుకుని వాకిట్లో నించుంది. అడుక్కునే పిల్ల ఆ గౌను కేసి ఆశగా చూసినట్లు అన్పించిందట! వెంటనే ఇప్పి ఇచ్చేసి లోపలికి వచ్చేసింది. వాళ్ళమ్మగారు ఎంతగానో తిట్టి కేకలేసారు. మేమంతా దాన్ని చిన్నప్పుడు దానకర్ణ అని పేరుపెట్టి ఏడిపించేవారం.

"నీకు తెలుసుకదూ! నా నిశ్చయం! ఆ నిశ్చయానికే ఇప్పుడు భంగం వాటిల్లింది. ఇంక నా మనస్సుకి అశాంతి కాక మరేముందీ! ఇలా నా జీవితం అశాంతిలో అంత మవ్వాలని భగవంతుడు నా నుదుట వ్రాసేవున్నాడు కాబోలు!"

అర్థంకానట్లు చూసాను ఆమెవైపు.

"నేను ఏవ్యక్తినైతే, మనసార సుఖపెట్టాలని కాంక్షిం చానో, ఆ వ్యక్తికి నావునికివల్ల అబద్దాలు ఆడాల్సిన అవస రమూ, తోటివ్యక్తికి అపకారంచేసే ద్రోహబుద్ధి, అలవాటు అయితే నాకు ఆత్మశాంతి ఎల్లా వుంటుంది!"

"భగవంతుడా!" నమ్మలేకపోయాను వసుధని, మన సారా ప్రేమించి, పెళ్ళిచేసుకొన్న, జీవన్ ఇంత వంచకుడా!

"ఏమయింది, వసుధా!" నీరసంగా అన్నాను, "అదే చెప్తున్నాను. నీకు తెలుసుకదూ!"

"వూఁ" ఆశ్చర్యపోయాను.

"ఆనీరజతో ఈయనకు, రెండు సంవత్సరాలనుండి సంబంధం వుందట! అందుచేత నీరజకి ఇంక మామూలు వివాహంమీద కోర్కెలేదట! ఈయనకి ఇల్లాంటి విష యాల్లో సహకరించేందుకు ఒక పార్టనర్ వున్నాడు యతి రాజు అని. ఈయన ప్రెపోజల్ ఏమిటంటే, ఆమెని యతిరాజు కట్టడీలో వుండమనిట! నీరజ వప్పుకోవటంలేదు. ఆమె జీవన్ని, మనసారా ప్రేమించింది. ప్రేమలో వివేకంకోల్పోయి శీలాన్ని అర్పించింది. ఆయతిరాజు కోమటిబిడ్డ! అతనికి ఇల్లాంటిడక్కాముక్కలు అన్ని తెలుసును. ఒకసారివాడుకొన్న పరుకుని తిరిగి ఎల్లా అమ్మాలో తెలుసు. యతిరాజుతో వొప్పందం నీరజని భయస్తురాలినిగా చేసింది. తన పవిత్రతను బజారుపాలు చేసినందుకు ఈయన్ని నిందిస్తూ వ్రాసిన వుత్త

రాన్ని నేను చూసాను. బాధపడ్డాను. తోటి స్త్రీ యొక్క అసహాయస్థితికి నిశ్శబ్దంగా రోధించాను. 'జీవన్‌ని' నిలవేసాను. అడిగాను. గానీ చిత్రం! చూడు! జీవన్ ఆమెని అసహాయని చేసింది చాలక తనకేమీ తెలీదని అబద్ధం చెప్పాడు. ఆమెని తూలనాడాడు. అచ్చుగుద్దినట్లుండే నీరజ పాపని కూడా తనది కాదన్నాడు. ఇదేమీ పురాణకాలం కాదుకదా! ఆకాశ వాణి ద్వారా దేవతలు ఆమె సౌశీల్యాన్ని చూపి పూలవృష్టి కురిపించేందుకు?

నీరజ ఎక్కడికి వెళ్ళిపోయిందో నాకు తెలియదు. మళ్ళీ ఎక్కడన్నా కనిపించుతుందేమో అని వెతుకుతున్నాను. ఆమె స్థానాన్ని ఆమెకిచ్చివేయాలి అని నాతాపత్రయం! నేను నమ్మి ప్రేమించి పూజించే జీవన్‌ని ఇంకా అంటిపెట్టుకొని వుండి ఆయన్ని అసత్యవాదిగా తయారుచేయలేను. ఒక ముద్దులు మూటగట్టే పాపని తండ్రి ఎవరో చెప్పుకోలేని, దీనురాలిలా పెరగనివ్వలేను!" వసుధ అన్నదాంట్లో దృఢదీక్ష కనపడింది నాకు. వసుధ కార్యవాదిని. అన్నంతపనీ చేస్తుంది. కాని జీవన్ గురించి నమ్మబుద్ధవటంలేదు. అంత సత్యసందుడుగా కన్పించే జీవన్‌లో ఈమోసపుతెర ఎక్కడ దాగుంది? ఎవర్ని నమ్మటం? ఎవర్ని నమ్మకపోవటం? భగవంతుడా! ఈవ్యక్తుల్ని ఇంత వింతగా ఎల్లా సృజించేవయ్యా!

జీవన్ ఇంతలో పకపక లాడుతూ వచ్చాడు.

"హో! మీరా! చూడండీ మీ వసు రోజు రోజుకీ ఎలా చిక్కిపోతుందో" అన్నాడు సహజ ధోరణిలో!

"చిక్కిపోవడం లేదు. అనృత భాండంలోంచి నిజాన్ని చిలికి తీస్తోంది. అందువల్ల అలసట చెందుతోంది!" అన్నాను.

"ఆ నిజం కరిగిపోదుటండీ!" పకపక లాడేడు జీవన్.

"నిజం కరగదు. ఎప్పటికీ! తప్తలోహాలలో కరగక నిలిచేదే నిజం!" అన్నాడు దృఢంగా.

"అయితే నిజాన్ని నమ్మకండి. అబద్ధాన్ని నమ్మండి. అబద్ధంలోవున్న ఆనందం నిజంలో లేదు." మరీ గట్టిగా నవ్వాడు జీవన్, నేనూ నవ్వాను విధిలేక వసుధా, నెమ్మదిగా నవ్వింది. ♦ ♦ ♦